కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడి

- రైల్వే న్యూకాలనీ హైస్కూళ్ల ఆధునికీకరణ
- అదనపు అంతస్తులు, తరగతి గదుల నిర్మాణం

తాటిచెట్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసిన విషయం తెలిసిందే. ఆయన సుపరిపాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా నిధులు మంజూరు చేసి సర్కారు బడులను అభివృద్ధి చేసి ఉన్నతి స్థితికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు నిధులతో ఎంపిక చేసిన స్కూళ్లను.. స్మార్ట్‌సిటీ నిధులతో మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది.

ఇందులో భాగంగా స్మార్ట్‌సిటీ నిధులతో 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కేఎస్ఎం గర్ల్స్ హైస్కూళ్లను ఆధునికీకరించారు. ఈ రెండు స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాలకు అదనంగా మరో అంతస్తును, దానిపై ఐదు గదులను నిర్మించారు. ఇంకా కొంత ఫర్నిచర్ రావాల్సి ఉంది. అది కూడా వస్తే వచ్చే ఏడాది నుంచి ఈ తరగతి గదులను అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో మరింత విశాలంగా మరిన్ని సదుపాయాలతో ఈ పాఠశాలలు మారనున్నాయి.

స్మార్ట్‌సిటీ నిధులతో సదుపాయాలు

ఈ రెండు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఫర్నిచర్, డిజిటల్ విద్యాబోధన, డైనింగ్ హాల్స్, వాష్‌రూమ్స్, ల్యాబ్, మంచినీటి సదుపాయం, పచ్చదనం పెంపుదల వంటి పనులను స్మార్ట్ సిటి నిధులతో చేపట్టారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయనడానికి నగరం నడిబొడ్డులోని ఈ పాఠశాలలే ప్రత్యక్ష సాక్ష్యాలు.


కొత్తగా నిర్మించిన అదనపు అంతస్తు

పూర్తిగా ఇంగ్లిష్ మీడియం

జీవీఎంసీ హైస్కూల్ 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి రానుందని హెచ్ఎం జి.సన్యాసిరావు తెలిపారు. ఈ ఏడాది 68 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు.


రైల్వే న్యూకాలనీలో అదనపు గదులతో కూడిన జీవీఎంసీ హైస్కూల్

నూరు శాతం ఉత్తీర్ణతకు..

కేఎస్ఎం బాలికల హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 370 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరిలో ఈ ఏడాది 66 మంది ఇంగ్లిష్ మీడియం, 10 మంది తెలుగు మీడియంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని, నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తామని హెచ్ఎం కె.రాము తెలిపారు.


కేఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో స్మార్ట్ క్లాస్ రూమ్

కె.కె.రాజుకు ముస్లిం నాయకుల మద్దతు


వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో ముస్లిం నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గురువారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముస్లిం నాయకులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఉత్తర నియోజకవర్గంలోనే వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. కె.కె. రాజుతో కొద్దిసేపు చర్చించారు.

పలు సంఘాల నాయకులు, వివిధ సామాజిక వర్గానికి చెందిన నాయకులు కలిశారు. కార్యక్రమంలో ఐ.హెచ్.ఫరూఖీ, కార్పొరేటర్ బర్కత్ అలీ, షేక్ బాబ్జీ, కేవీ బాబా, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరావు నేతృత్వంలో రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాకు సంబంధించి 13 మంది సచివాలయ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్‌పై పలు సూచనలిచ్చారు. 85 ఏళ్ల దాటిన వారు, ఫిజికల్ హ్యాండీక్యాఫ్, కోవిడ్ బాధితులకు సంబంధించి ఇంటి వద్దకు వెళ్లి 12డీ అప్లికేషన్ నింపించి వారి ఓటును పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.


సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

వైద్య శిబిరానికి విశేష స్పందన

సీతంపేట: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్, స్పెషలిస్ట్ డాక్టర్లు రోగులను పరీక్షించి అవసరమైన రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో 313 మంది వివిధ రకాల వైద్య సేవలు పొందగా, 63 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు.


రోగి వివరాలు పరిశీలిస్తున్న డాక్టర్ మనోజ్

క్లుప్తంగా

అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం


కె.కె.రాజుకు అభినందనలు తెలుపుతున్న రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును పార్టీ కార్యాలయంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని కార్పొరేటర్, వార్డు నాయకులు ఆయనకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెట్ట దమయంతి, పైడి ప్రతాప్, ప్రసూనారెడ్డి, కరిమిరెడ్డి శ్యామ్, నూకరాజు, రత్న, ధర్మవతి, రాజేశ్వరరావు, రాణి, గణేష్, అప్పారావు, వెంకటరమణ, అప్పలరాజు, సుధాకర్, వినోద్, సంతోష్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన


గాంధీనగర్‌లో పనులు పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

సీతమ్మధార: సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం జీవీఎంసీ జోన్–3 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శ్రీనివాస్, టీపీవో ప్రమీల, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. రెవెన్యూ క్వార్టర్స్ వద్ద రోడ్డుకు మార్కింగ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డికంచరపాలెం బాపూజీనగర్‌లో తన అన్న సురేష్‌రెడ్డితో కలిసి నివసిస్తున్న బోర సుధాకర్‌రెడ్డి(40) కూలి పనులు చేస్తుంటాడు. వివాహం కావట్లేదని, తరచూ అందరితో గొడవలు పడుతుండేవాడు. గురువారం ఉదయం పనికి వెళ్లడానికి ఎంతకీ కిందకి రాకపోవడంతో.. అతడి అన్నయ్య మేడ మీద గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందడాన్ని గుర్తించారు. అతడి అక్కకి ఫోన్ చేశారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి అక్క జి.నిర్మల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వీరమ్ బ్లాక్ ప్రారంభం


వీరమ్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్

సింధియా: విశాఖపట్నంలోని నౌశక్తినగర్‌లో డీఎస్సీ సిబ్బంది(492 మంది పురుషులు) కోసం వసతి భవనం వీరమ్ బ్లాక్‌ను గురువారం నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం, వీఎస్ఎం ప్రారంభించారు. వీరమ్ బ్లాక్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, వ్యాయామశాల, వినోద పరికరాలు, గ్రంథాలయ సౌకర్యాలతో కూడిన అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ గురువారం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు నాకవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తలపడుతున్నాయి. ఈ పోటీలను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లను అభినందించారు. రైల్వే స్టేడియంలో పూర్తిస్థాయి క్రీడా వసతులున్నాయన్నారు. ఈ నెల 24తో ముగియనున్న టోర్నీ పోటీలను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్, ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ బాతి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ మెన్ పోటీల్లో స్పైక్‌ను బ్లాక్ చేస్తున్న ఆటగాళ్లు

కేఏ పాల్‌తోనే అభివృద్ధి

తాటిచెట్లపాలెం: విశాఖ ఎంపీగా ప్రజాశాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విజయాన్ని ఎవరూ ఆపలేరని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్ అన్నారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. విశాఖ అభివృద్ధి చెందాలన్నా, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా ఆపాలన్నా, వితంతువులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలన్నా కేఏ పాల్‌ను విశాఖ నుంచి ఎంపీగా గెలిపించాలన్నారు. కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి కేఏ పాల్ గెలుపునకు కృషి చేస్తే పార్లమెంట్‌లో ప్రజాసమస్యలపై ఆయన పోరాడతారని రవికుమార్ అన్నారు. సమావేశంలో పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ బాబూజీరావు, రాజు భవాని, స్వాతి సతీష్, అజయ్, ఏడు నియోజకవర్గాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

భారత్ వికాస్ పరిషత్ మహిళా కార్యవర్గం ఎన్నిక


ఝాన్సీ లక్ష్మీభాయ్ మహిళా శాఖ కొత్త కార్యవర్గ సభ్యులు, బీవీపీ ప్రతినిధులు

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయ్ మహిళా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణంలోని పరిషత్ కార్యాలయంలో జరిగింది. 2024–25 సంవత్సరానికి జరిగిన ఎన్నికలో అధ్యక్షురాలిగా పి.షర్మిల, కార్యదర్శిగా డాక్టర్ సి.నిర్మలా దేవి, కోశాధికారిగా వి.విభవ సుందరి ఎన్నికయ్యారు. నూతన సభ్యులను పరిషత్ ప్రాంత్ స్థాయి ప్రతినిధి వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, మీడియా ఇన్‌చార్జి ఎం.వి.రాజశేఖర్, ఝాన్సీ లక్ష్మీభాయ్ మహిళా శాఖ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చుకలను సంరక్షించుకుందాం

సీతమ్మధార: సీతమ్మధారలోని సత్వ నేచురల్స్ స్టోర్‌లో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిచ్చుకలకు వరి కంకులు, నీరు అందించేందుకు మట్టి పాత్రలు, నీడ కల్పించేందుకు ఉపయోగపడే మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల పర్యావరణంలో పిచ్చుకలు అంతరించి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని సంరక్షించుకోవాల్సి అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, ఖాతాదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


సీతమ్మధార స్టోర్ వద్ద పిచ్చుకల దినోత్సవం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

24న మెగా రక్తదాన శిబిరం

సీతంపేట: వాసవీ క్లబ్ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్లను గురువారం హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా రక్త నిధి కొరత తీర్చడానికి మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. వాసవీ వాల్తేర్ కపుల్స్ కోశాధికారి కె.రామకృష్ణ మాట్లాడుతూ మేము సైతం అనే నినాదంతో ఈ నెల 24న నగరంలోని నాలుగు కేంద్రాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ హాస్పిటల్, అంబికాబాగ్‌లోని అమ్మా బ్లడ్ బ్యాంక్, మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ, ఎంవీపీ కాలనీ దయా హాస్పిటల్‌లో శిబిరాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.శ్వేత, డాక్టర్ ఇ.శ్రీవిద్య, కె.మేరీ, కె.తులసి, కె.రాజ్యలక్ష్మి, జి.ప్రశాంతి పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్, రామకృష్ణ

క్షయపై అవగాహన ర్యాలీ

కంచరపాలెం: ఈ నెల 24 ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం'అనే నినాదంతో జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం కూడలిలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.డాక్టర్ మట్టా శశి ప్రియాంక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్, ఎల్‌టీ పూర్ణిమ, టీబీహెచ్‌వీ ఎస్ పైడిరాజు, హెచ్‌వీ భారతీ, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


కంచరపాలెం యూపీహెచ్‌సీలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ మట్టా శశి ప్రియాంక

ఐపీఆర్ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీలో 'పల్లి'


పల్లి నాగభూషణరావు

దాబాగార్డెన్స్: భారత ప్రభుత్వంచే కాపీరైట్ సొసైటీగా నమోదైన ఇండియన్ పెర్ఫార్మింగ్ రైట్ సొసైటీ(ముంబై) ఇటీవల దక్షిణ భారతదేశంలో తెలుగు భాషకు సంబంధించి ఐపీఆర్ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు ప్రముఖులు గల ఈ కమిటీలో వ్యావహారిక గీత రచయిత, స్వరకర్త, గాయకుడు పల్లి నాగభూషణరావుకు సభ్యుడిగా స్థానం కల్పించారు. కమిటీ సభ్యుల్లో హైదరాబాద్‌కు చెందిన రబీంద్ర ప్రసాద్ పట్నాయక్, అర్రం వేణుగోపాల్, కృష్ణకాంత్ గుండగాని, భాస్కరభట్ల రవికుమార్, ఎంఎం శ్రీలేఖ, కీర్తితో పాటు విశాఖకు చెందిన పల్లి నాగభూషణరావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం డిమిరయా గ్రామంలో జన్మించిన పల్లి అన్ని కళారూపాలను యూ ట్యూబ్ చానళ్లలో నిక్షిప్తం చేసి, విశ్వాత్మక కళా సంగ్రహ వేదికను తయారు చేశారు.

నేడు క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 వరకు జరిగే ఈ పూజలో పాల్గొనేందుకు రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'గైస్'లో జోరుగా అభివృద్ధి పనులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో పాత భవన సముదాయం పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ భవనానికి మరమ్మతులు చేస్తే మరికొన్నేళ్లు వినియోగించుకునే అవకాశం ఉన్నందున ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. జీ+2 పద్ధతిలో దీన్ని గతంలో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్యాలయం, తరగతులు, పైన ఉన్న రెండు అంతస్తుల్లో తరగతులు, లైబ్రరీతోపాటు కొన్ని ల్యాబ్‌లకు వినియోగించేవారు. మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.72 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈమేరకు ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మరమ్మతు చేసే పనులు రెండు నెలల కిందటే మొదలు పెట్టి చురుకుగా కొనసాగిస్తున్నారు. శ్లాబ్ మరమ్మతులు, టాయిలెట్స్, పైప్‌లైన్స్, కిటికీలు, రంగులు, కన్సీల్డ్ విద్యుదీకరణ పనులు చేపట్టారు. ఇది అందుబాటులోకి వస్తే కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీకి పూర్తి స్థాయి వసతి సౌకర్యాలు సమకూరుతాయి.


కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ పాత భవనానికి నిర్వహిస్తున్న మరమ్మతులు

వార్డు కార్యాలయాల మూసివేత


51వ వార్డులో మూసివేస్తున్న టీడీపీ వార్డు కార్యాలయం


50వ వార్డులో మూసి ఉన్న బీజేపీ వార్డు కార్యాలయం

మద్రిపాలెం: జీవీఎంసీ 50, 51 వార్డుల్లోని టీడీపీ, బీజేపీల కార్యాలయాలను గురువారం అధికారులు మూయించారు. 50వ వార్డులోని పోలింగ్ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న టీడీపీ, బీజేపీ వార్డు కార్యాలయాల మూసివేత చర్యలు చేపట్టారు. 50వ వార్డు పోలింగ్ కేంద్రానికి ఎదురుగా ఉన్న టీడీపీ కార్యాలయంతోపాటు 100 మీటర్ల దూరంలో ఇటీవల ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని మూసివేశారు. అనుమతులు లేకపోవడంతోనే బీజేపీ, టీడీపీల కార్యాలయాలు మూసేశారని పలువురు చెబుతున్నారు. టీడీపీ వార్డు కార్యాలయాల బయట ఏదో బ్యానర్లతో మొక్కుబడిగా వాటిని మూసివేశారంటూ విమర్శిస్తున్నారు.

కార్మిక పరిరక్షణకు పోరాడతాం

కంచరపాలెం: కార్మికుల పక్షపాతిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి పరిరక్షణకు పోరాడతామని ఇండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్) జనరల్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. కంచరపాలెం పరిధి మేఘాద్రిపేటలోని కళా మేఘా ఓపెన్ ఆడిటోరియంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఓపీఎస్ సాధన, 8వ పే కమిషన్ ఏర్పాటు, పూర్వ నేవెల్ డాక్ యార్డ్ అప్రెంటిస్ ఇంక్రిమెంట్లు, ఓటీ, హెచ్ఆర్ఏ, పలు సమస్యలపై ఆయన మాట్లాడారు. ఓపీఎస్ సాధన కోసం ఆలిండియా కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపై పోరాటం చేస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఐఎన్‌సీఈయూ అధ్యక్షుడు బి.భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.చిన్నారావు, ఏన్ఏడీ జీఎస్ ఎస్ మారయ్య, డీజీఎన్‌పీ అధ్యక్షుడు మేరపురెడ్డి కొండబాబు, ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్, అప్పలరాజు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అటవీ దినోత్సవం

దాబాగార్డెన్స్: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, గ్రీన్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మొక్కలు నాటి విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. విజేతలు ఎస్.కిరణ్మయి, బి.దాలమ్మలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ జె.లావణ్య, రసాయన శాస్త్ర విభాగాధిపతి బి.ఎస్.అనూష, జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ శశికళ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం 132 కేవీ సెక్షన్ పరిధిలో పలు నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సత్యసాయినగర్, సింగాలమ్మపురం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఈటర్స్ స్టాప్ రెస్టారెంట్, వినాయక గుడి పరిసరాల్లోని గ్రీన్‌పార్క్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

289 మందికి వైద్య పరీక్షలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట కంచరపాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిని మట్టా శశిప్రియాంక తెలిపారు. ప్రత్యేక వైద్యాధికారుల పర్యవేక్షణలో పలు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జోన్–5 పబ్లిక్ హెల్త్ ఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.